# కవితావతరణం

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

తమసానదీ తరంగాలపై ప్రాతఃకాల సూర్యకిరణాలు పరవళ్లు దొక్కుతూ ప్రసరించాయి. తీరసైకతం వరకు ప్రవహించిమరలిపోయే చిరు తరంగాల మలుపులలో సన్నని ఇసక రేణువులు రత్నచూర్ణంలా తళతళా మెరిశాయి.

మహర్షి వాల్మీకి తమసానదిలో స్నానం చేసి, పరిశుభ్రవల్కలాలు ధరించి, జపతపాలు ముగించుకొని, తన ఆశ్రమానికి బయలుదేరాడు. శిష్యుడు భారద్వాజుడాయన మడుగు దోవతులు భుజంమీద వేసుకుని ఆ మహర్షి అడుగుజాడల్లో అడుగులు వేసుకుంటూ వెంటవెంటనే సవినయంగా నడిచి వెళ్లిపోయాడు.

మహర్షి అలాగ నడిచిపోతున్నాడన్న మాటే కాని ఆయన మనస్సంతా నారద మహర్షి చెప్పిన సూక్తుల మీదనే లగ్నమైపోయింది.

“ప్రస్తుతం ఈ లోకంలో మహనీయుడైన పురుషోత్తము డెవరు?”

అని వాల్మీకి నారదమహర్షి నొకమారు ప్రశ్నించాడు. నారదుడు శ్రీరామ కథ సంగ్రహంగా ఆయన కెరిగించి, అతడే లోకోత్తర పురుషుడని అభివర్ణించి చెప్పాడు. అప్పటినించీ వాల్మీకి హృదయం శ్రీరామ చరిత్రమీద నే లగ్నమై పోయింది.

ఇంతే కాక, ఆ మనోహర సూర్యోదయ వేళలో ఆనంద డోలికలలో ఓలలాడుతున్న పరిసరారణ్య పక్షుల కిలకిలా రావాలాయన హృదయంలో పసిపాపల బిలిబిలి పలుకుల్లా వినిపించాయి. లేళ్లు, జింకలు, నెమళ్లు మొదలయిన ఆశ్రమజీవాలామహర్షి తనుపక్కనే నడిచిపోతున్నా, అది గమనించనట్లే వెంగు వెంగున గంతులు వేసుకుంటూ అరణ్యంలో నిర్భయంగా యథేచ్ఛగా విహరిస్తున్నాయి. మరికొన్ని చిన్న చిన్న లేడి పిల్లలు మహర్షి చేత ధరించిన కమండలువు తమ తల్లి పొదుగనుకొని బాగా దగ్గిరికి చేరుకొన్నాయి

రామకథా స్మరణంలో లీనమైన వాల్మీకి హృదయం కొంతసేపటికా అరణ్య ప్రాతఃకాల సౌందర్యంలో తన్మయమై పోయింది.

లేత లేత సూర్యకిరణాలప్పుడప్పుడే మేలుకొన్న చిత్రవిచిత్ర వర్ణాల విహంగాలతో కలిసి దిగ్దిగంతాలవరకు పరుగులు పెడుతున్నాయి; పసరి పచ్చికలపై విశ్రమించిన మంచు బిందువులకు గిలిగింతలు పెట్టి నవ్విస్తున్నాయి

ఆకాశంలో ఎగురుతూ రంగురంగులతోరణాలలాగ వేలాడే పక్షుల బారుల సొగసులు పరిశీలించగానే మహర్షికి ప్రపంచమంతా ఒక మహానందలీలా డోలికగా భాసించింది

అందులోను ఒక క్రౌంచపక్షి మిథునం ఆనందోల్లాసాలవలోకిస్తుంటే ఆ మహాకవి హృదయం రెక్కలు కట్టుకొని ఆకాశానికె ఎగిరిపోయింది.

క్రౌంచపక్షులు రెండు చక్రాకారంగా గిరగిరా తిరిగాయి మళ్ళీ అవి రెండు ఒక చిన్న రెమ్మమీద వాలి అప్రయత్నంగా తూగుటుయ్యాలలూగాయి అంతలో మగపిట్ట ఒక పండేదో ముక్కుతో కరిచి పట్టుకొనివచ్చి ఎంతో ఆప్యాయంగా ఆడపిట్ట కందించింది. ఆడపిట్ట అది కొంచెం ఆరగించి తిరిగి మగపిట్టకందించింది.

అంతలో అవి రెండు జంటగా ఆకాశంలో ఎగురుతూ అత్యంత మనోహరంగా ధ్వనించాయి.

ఆ అమాయిక జీవుల అన్యోన్యత, అప్యాయత చూడగానే మహర్షి హృదయంలో ఆనందదుగ్ధం జాలై ప్రవహించింది. ఆ ద్రష్ట్రృషి పిట్టజంట ఎటుపోతే అటువైపే తిరిగి ఆనందంతో ఊరకలు వేసింది. అతని నేత్రాలు రెండుపిట్టలై క్రౌంచ మిథునం వెనువెంట తిరిగాయి. ఆ ఆనందంలో మహర్షి తన గమ్యస్థానమే విస్మరించి యధేచ్ఛగా ముందుకు సాగిపోయాడు

అంతలో ఆ రెండుపిట్టలు ఒకే గొంతుతో ఎంతో మనోహరంగా గానం చేశాయి. ఆ ధ్వని మాధుర్యం ఆ పరిసరారణ్యంలో అంతటా మంద్ర మంద్రంగా మారుమోగింది. మహర్షి అలాగే అప్రయత్నంగా అడుగులు వేసుకుంటూ ఆశ్రమం వైపు నడిచిపోయాడు.

ప్రపంచంఅంతా నూతనోదయకాంతుల్లో అప్పుడప్పుడే మేలుకొని ఆ క్రౌంచపక్షుల ఆనందలీలలవైపే చూస్తూన్నట్లు కనబడింది. ద్రుమారణ్యమార్గంలోకూడా వాల్మీకి విశాల నేత్రాలు వాత్సల్యంతో తొణికిసలాడుతూ ఆ పక్షులతోబాటే ఆనందాకాశంలో విహరించాయి. చూస్తూండగానే క్రౌంచపక్షులు రెండు ఆకాశంలో చాలా దూరంవరకు ఎగిరిపోయాయి. మళ్ళీ రెండు రివ్వుమని జంటగా కిందికి దిగివచ్చాయి. కాని ఆ క్షణంలో ఆ జంట ఉత్సాహం మిన్నుముట్టింది!

౨

అంతలోనే ఆకాశంలో కీచుమని ఒక మహాదారుణ కరుణాక్రందనం వినబడింది. మహర్షి హృదయం ఆ ఆక్రందన ధ్వని వినీ వినడంతో నిలువునా చీలిపోయింది. ఆ తత్క్షణంలో మగపిట్టరక్తసిక్తమై వాల్మీకి కనతిదూరంలోనే నేలపై కూలి గిలగిలాకొట్టుకుని ప్రాణం విడిచింది. ఆడపిట్ట ఆకాశంలో చక్రాకారంగా తిరుగుతూ అతి దీనంగా, జాలిగా ఆ మగపిట్టకోసం ఆక్రోశించింది.

అల్లంతదూరంలోనే బోయవాడొకడు వింటెక్కుపెట్టి మగపిట్టమీద బాణం వేశాడు. ఆ బాణం కనురెప్పపాటులోనే మగపిట్ట ప్రాణాలు హరించివేసింది

ఆడపిట్ట దారుణకరుణాక్రందనం వినగానే వాల్మీకి హృదయం శోకావేశంతో ద్రవించి జాలైపోయింది. మహర్షికిక ఒక్క అడుగు ముందుకు పడలేదు. కంఠం గద్గదంతో వణికిపోయింది. ఆయన ముఖతః అప్రయత్నంగా ఒక ఛందోమయగీతం వెలువడింది.

‘మానిషాద ప్రతిష్ఠాం త్వ
మగమః శాశ్వతీః సమాః
యత్ క్రౌంచమిథునాదేక
మవధీః కామమోహితమ్’

“నిషాదా! కామమోహితమైన క్రౌంచపక్షిని సంహరించివేశావే! నీవిక చిరకాలం జీవింపవుసుమా!”

అని ఆ గీతంతాత్పర్యం. వాల్మీకి తానన్న మాట తలుచుకొని తానే ఆశ్చర్యపోయాడు.

# కవితావతరణం

తన ముఖతః వెలువడినది సామాన్య గీర్వాణ వాక్యం కాదు!

అది ఛందోబద్ధమై నాలుగుపాదాల లయతోను, చరచరా సాగిపోయిన కరుణా క్రోశ వాఙ్మయావతారం! ఆ ఛందః స్వరూపం ఇంతకుపూర్వం వాల్మీకికొక్క వేదాలలో వినిపించింది. అది అపూర్వ కరుణాసౌందర్య సమ్మేళనం పొంది ఆ క్షణంలో అతని ముఖతః ఆవిర్భవించింది! మహర్షికా విషయంలో ప్రత్యేకంగా సంకల్పమేమీ కలగలేదు. కాని అది అంతరాంతరాలలో ప్రతిధ్వనిస్తూ అప్రయత్నంగా ఆ కవిబ్రహ్మ ముఖంలో నృత్యం చేసింది!

మహర్షి ఆ గీతిక నాలుగైదుమారులలాగే మళ్ళీ మళ్ళీ ఉచ్చరిస్తూ ఆ క్రౌంచ మిథునంపై విరుచుకుపడిన దారుణాఘాతాని కెంతైనా తల్లడిల్లిపోయాడు.

ఆ గీతికావతరణంతో భరద్వాజునికి కలిగిన ఆశ్చర్యానికిక అంతేలేదు. భరద్వాజుడు కూడా ఆ కరుణాక్రోశగీతం పదేపదే పదిమారులుచ్చరించాడు. ఆ విధమైన ఛందోవతారం సాక్షాత్తుగా వేదవాఙ్మయంలోనించే లౌకిక వాఙ్మయంలోనికి అవతరించినదని అతడనుకొన్నాడు.

'మానిషాద' గీతి మళ్ళీ సభక్తికంగా పఠించి మహర్షికా విషయం నివేదించాడు. వాల్మీకి అతని అభిప్రాయం కొంతసేపంతర్ముఖుడై ఏదో ధ్యానించాడు.

"నాయనా! ఈ గీతి క్రౌంచ పక్షి మిథునంపై నాహృదయంలో బయలుదేరిన శోకం వల్లనే ఆవిధంగా ఆవిర్భవించింది. ఇందుచేత ఇది నేటినించీ శ్లోకమనే పేరుతో ప్రసిద్ధికెక్కగలదు!"

అని అంతలోనే ఏదో ఆలోచిస్తూ అంతర్ముఖుడైనాడు.

ఆదికవిహృదయ శోకం అంతమాత్రంతోనే ఉపశమించలేదు. భరద్వాజుడలాగే మహర్షి వెంట నడకసాగించాడు.

మహర్షి హృదయంలో క్రౌంచపక్షి మిథునాన్ని గురించిన దురంత చింతాస్రవంతి అలాగే ఎడతెగకుండా ప్రవహించింది. కాని ఆవిధంగా ఆ శ్లోకం అప్రయత్నంగా ఆవిర్భవించడం అతనికి మరింత ఆశ్చర్యంగా కనిపించింది. ఆశ్రమంలో అడుగుపెట్టేవరకు మహర్షి హృదయంలో ఆలోచనలలాగే సాగిపోయాయి.

ఆనాటి సాయంకాలం వేళవరకు వాల్మీకి ఆ విషయాన్ని గురించి అనేక విధాలుగా మథనపడ్డాడు.

తమసానదీతరంగాలు దూరదూరంగా మంద్రమంద్రంగా వినిపించాయి వాల్మీకి వ్యాఘ్రాజినంమీద కూర్చొని ఆ శ్లోకాన్ని గురించి నిశ్చలంగా ధ్యానించాడు. అతని పార్శ్వంలో సాయంకాల హోమాగ్ని జ్వాలలు మంద్రంగా వేదాలుచ్చరిస్తున్నట్టుగా ధ్వనిస్తూ బాగా ప్రజ్వలించాయి. ఆ జ్వాలల కాంతులు వాల్మీకి మహర్షి వ్యాఘ్రాజినంమీద వింతవెలుగులు విరజిమ్మాయి.

వాల్మీకి హృదయం క్రమంగా ధ్యాన తన్మయతలో విలీనమైపోయింది. ఆ తన్మయతలో మహర్షికి క్రమంగా బాహ్యజగత్తే అదృశ్యమైపోయింది.

## 3

కొంతసేపటికి వాల్మీకి లోపలి చూపుల కెదురుగా చతుర్ముఖుడు ప్రత్యక్షమైనాడు. కవిబ్రహ్మ బ్రహ్మదేవునికి సాగిలపడి సభక్తికంగా చేతులు జోడించి నిలుచున్నాడు. మేఘ గంభీరస్వరంతో కమలాసనుడా మహర్షి సందేహాలొకటొక్కటిగా తొలగించి వేశాడు:

"మహర్షీ! ఆ శోకం నీ ముఖతః ఆ విధంగా ఆవిర్భవించడానికి కారణమేమని ఆశ్చర్యపడుతున్నావు కాబోలును!

వేదవాఙ్మయంఅనంతరం ప్రప్రథమంగా లౌకిక వాణిలో నీ వాక్కులోనే కవితావతరణం జరిగింది. నీకీనాటితో శబ్దబ్రహ్మ సాక్షాత్కారం జరిగింది. నీ వాది మహాకవివైనావు!

"శోకం శ్లోకమై అవతరించిన ఆ శ్లోకచ్ఛందస్సులోనే శ్రీరామగాథ రచించవలెసింది."

అని మహోల్లాసంతో చతుర్ముఖుడతని వైపుచూచి, అంతటితో తన ప్రసంగం ముగించివేశాడు.

వాల్మీకి హృదయంలోని సంశయగ్రంథులన్నీ చాలావరకు పటాపంచలైపోయాయి. అయినా ఏదో ఒక సందేహం అనిర్వాచ్యమై అతని హృదయాంతరాళలో సుళ్లు తిరిగింది.

అది గ్రహించి బ్రహ్మ కవిబ్రహ్మ సందేహచ్ఛాయ తొలగించి వేశాడు:

"ఆదికవీ! నీ సందేహం నాకవగతమైనది ఎప్పుడో జరిగిపోయిన శ్రీరామ చరితం తిరిగి నేనీనాడెలాగ రచించగలనని నీవు సంకోచిస్తున్నావేమో! నీవు సంకోచించవలసినంత అంతరాయమేమీ లేదు.

"నీ ఆదికావ్య రచనా సమయంలో భూత భవిష్యద్వర్తమాన వ్యవహారాలన్నీ నీ ఎదుట వర్తమాన రూపంలోనే గోచరించ గలవు! ఇంతే కాక ఆయా దేవమానవ రాక్షసుల మనోవృత్తులే కాక, పశుపక్ష్యాది ప్రాణుల మనోవృత్తులు కూడా నీకు కరతలామలకాలుగా గోచరించగలవు. ఇందువల్ల నీవాణిలో అసత్యలేశమైనా ప్రవేశించనేరదు. శ్రీరామాయణరచనవల్ల నీవాణి మానవలోకంలో నదీనదాలున్నంతవరకు శాశ్వతమై ప్రకాశించగలదు!

"అంతేకాక నీవీ మానవ శరీరం విడిచిన పిమ్మట నీకావ్యం మానవలోకంలో వినిపించినంతవరకు బ్రహ్మలోకంలో నాసాయుజ్యంలో నివసించగలవు! వెనువెంటనే శ్రీమద్రామాయణ రచన కుపక్రమించి జన్మ చరితార్థం చేసుకో! ఆర్షకవీ! నీ సత్సంకల్పం నిర్విఘ్నంగా నెరవేరుతుంది!"

ఆ మేఘగంభీరస్వరం విని వాల్మీకి మహాకవి కన్నులు తెరిచి చూచాడు.

వెంటనే ఆ వృత్తాంతం అంతా శిష్యుడు భారద్వాజుని కెరిగించాడు.

మరునాడు ప్రాతఃకాల జపతపాలన్నీ ముగించుకొని శ్రీమద్రామాయణ రచన కుపక్రమించాడు. అతని రచనాసమయంలో అంతటా 'మానిషాద గీతి' ఒక మహాశ్రుతిగా మారుమోగింది.

దేశసౌభాగ్యానికి జాతీయ ప్రోత్సాహము ఎంతో అవసరం
అలాగే ఆంధ్రాభ్యుదయానికి ఆంధ్ర సంస్థలను ఆంధ్రులు ప్రోత్సహించుటకూడా చాలా అవసరం.
ఎల్లవేళలా మీ ఆరోగ్య రక్షణకు వలయు సమస్తమందులను సరసమైన ధరలకు విక్రయించు ఏకైక
ఆంధ్ర సంస్థ
స్వామి సన్స్
మందుల వ్యాపారులు
అబీడ్ రోడ్డు, హైదరాబాదు, (దక్కన్.) ఫోన్: 5498